

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండల పరిధిలో మెకానికల్, ఐటిఐలో విద్యాభ్యాసం పూర్తి చేసిన యువతీయువకులకు జెఎన్‌టియుకె ఆధ్వర్యంలో ఆటోమొబైల్ ఆటోమేషన్ రోబోటిక్ టెక్నాలజీ, ఎంబాడెడ్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎపిఎం బి.ప్రశాంతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణానంతరం మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారని తెలిపారు. అర్హత కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాలుగు నెలల పాటు జరిగే శిక్షణలో ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తారన్నారు. మరిన్ని వివరాలకు జాబ్స్ జెసిఐ జి.వి.రమణ మొబైల్ నెంబర్ 9989881098ను సంప్రదించాలన్నారు.

గ్రంథాలయాలకు గ్రహణం వీడేదెన్నడో?

- భర్తీ కాని ఖాళీ పోస్టులు
- వెంటాడుతున్న సౌకర్యాలు లేమి
- పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

విజ్ఞానాన్ని అందించాల్సిన గ్రంథాలయాలు ప్రభుత్వ తీరుతో నిరసిస్తున్నాయి. నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఏళ్ల తరబడి ఖాళీ పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. అసౌకర్యాల చెరలో కూరుకుపోయాయి. భారీగా సెస్ పేరుకుపోవడంతో సమస్యల వలయంలో చిక్కుకున్నాయి.

జిల్లా కేంద్రం కాకినాడలో ఒక కేంద్ర గ్రంథాలయంతో పాటు, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 102 శాఖా గ్రంథాలయాలు, 14 గ్రామీణ గ్రంథాలయాలు, 145 పుస్తక నిక్షిప్త కేంద్రాల ద్వారా పాఠకులకు సేవలు అందుతున్నాయి. ప్రస్తుతం వీటిలో సుమారుగా 15 లక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు 64 సొంత భవనాల్లోనూ, 13 అద్దె భవనాల్లో, 31 ఉచిత భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రతిరోజూ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి సుమారు 200 మంది, మిగతా గ్రంథాలయ శాఖలకు దాదాపు 10వేల మంది వరకూ పాఠకులు వస్తుంటారు. ఏడాదికి 30 నుంచి 33 లక్షల మంది పాఠకులు గ్రంథాలయాలకు హాజరవుతున్నారని అధికారులు తెలిపారు.

ఏళ్ల తరబడి భర్తీ కాని పోస్టులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లో మంజూరు పోస్టులు 255 ఉన్నాయి. వీటిల్లో 70 మంది మాత్రమే శాశ్వత ఉద్యోగులు పని చేస్తున్నారు. 185 ఖాళీలున్నాయి. లైబ్రేరియన్ గ్రేడ్-1 పోస్టులు ఆరుగురికి నలుగురే ఉన్నారు. లైబ్రేరియన్ గ్రేడ్-2 పోస్టులు 11 మందికి ముగ్గురే పని చేస్తున్నారు. లైబ్రేరియన్ గ్రేడ్-3 పోస్టులు 47 ఉంటే 23 మంది, జూనియర్ అసిస్టెంట్లు ఇద్దరికి ఒకరు పని చేస్తుండగా టైపిస్ట్ పోస్టులు రెండు ఖాళీలున్నాయి. రికార్డ్ అసిస్టెంట్లు 51 మందికి 23 మంది ఉండగా


జిల్లా గ్రంథాలయంలో పాఠకులు

28 ఖాళీలున్నాయి. ఆఫీసు సబార్డినేట్స్ 80 మందికి ఏడుగురే పనిచేస్తుండగా 73 ఖాళీలు ఉన్నాయి. విలేజ్ లైబ్రేరియన్స్ 51 మందికి ఏడుగురే పని చేస్తుండగా 44 ఖాళీలు ఉన్నాయి. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 19 మంది లైబ్రేరియన్లు 13 మంది పనిచేస్తుండగా 6 ఖాళీలు ఉన్నాయి. లైబ్రరీ హెల్పర్ పోస్ట్ ఒకటి ఖాళీ ఉంది. మొత్తం 37 ఔట్ సోర్సింగ్ పోస్టుల్లో ఏడు ఖాళీలున్నాయి. ఏళ్ల తరబడి ఖాళీ పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఉన్న వారిపైనే పని భారం పడుతోంది. అరకొర ఉద్యోగులు, సిబ్బంది వలన వారిపైనే ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. ముఖ్యమైన పనులు ఉంటే సెలవులు పెట్టుకోవడానికి కూడా వీలు లేకుండా పోతుందని సిబ్బంది తెలిపారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నా విధులకు హాజరు కావాల్సి వస్తుందని వాపోతున్నారు.

కేంద్ర గ్రంథాలయంలో...

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కార్యాలయ సిబ్బంది ఐదు ఖాళీలు ఉన్నాయి. ఒక జూనియర్ అసిస్టెంట్ పోస్టు, ఇద్దరు టైపిస్టులు, ఒక బైండర్ అవసరం ఉన్నారు. అలాగే కాకినాడ గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ లేరు. గ్రంథాలయంలో పుస్తకాలు, ఇతర రికార్డుల నమోదుతోపాటు, పాఠకులకు పుస్తకాలు అందజేయడం, సభ్యత్వ నమోదు, పుస్తకాలు తిరిగి తీసుకోవడం, వాటిని ర్యాకుల్లో సర్దడం, దినపత్రికల ఫైలింగ్ వంటి పనులన్నీ గ్రంథాలయాధికారే చేయాల్సి వస్తోంది. జగన్నాథపురంలో బాలల, శ్రీనగర్ శాఖా గ్రంథాలయాలు సిబ్బంది కొరత కారణంగా మూత పడ్డాయి. తుని గ్రంథాలయం గ్రేడ్-1 విభాగంలో ఉన్నప్పటికీ రికార్డు అసిస్టెంట్ తో నిర్వహిస్తున్నారు. తాళ్లరేవు, కాజులూరులకు ఒకే గ్రంథాలయాధికారి ఉండటంతో ఒక్కోచోట మూడేసి రోజులు చొప్పున పనిచేస్తున్నారు. శంఖవరంలో కూడా ఇదే పరిస్థితి ఉంది.

అసౌకర్యాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్థానిక సంస్థల నుంచి సుమారు రూ. 8 కోట్లు సెస్ బకాయిలు పెండింగ్లో ఉన్నాయి. అలాగే పలు గ్రంథాలయాల్లో సదుపాయాల లేమితో పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేకచోట్ల మరుగుదొడ్లు, తాగునీటి సమస్య ఉంది. విద్యార్థులు, నిరుద్యోగులు కోరుకున్న విధంగా పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, ఇంటర్నెట్ సేవలు అందుబాటులో లేవు. పలు భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో విజ్ఞానాన్ని అందిస్తున్న గ్రంథాలయాల అభివద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని, అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలని పలువురు పాఠకులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



జూనియర్ కళాశాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేస్తున్న విద్యార్థులు

విద్యార్థుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

నిరసన దీక్షలో ఎస్ఎఫ్ఐ నాయకులు
పలు ప్రజా సంఘాలు, పార్టీ నాయకుల మద్దతు

ప్రజాశక్తి - కాకినాడ

ఇంటర్ విద్యార్థుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, ఇప్పటికైనా వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేస్తూ కాకినాడ ధర్నా చౌక్ రోడ్డులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరాహార దీక్షను సోమవారం నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వి.మహేష్ దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు మాటాడారు. జూనియర్ కళాశాలలు ప్రారంభమై రెండునెలలైనా ప్రభుత్వం నేటికీ పాఠ్య పుస్తకాలు అందించలేదన్నారు. పుస్తకాలు లేకుండా చదువు ఎలా వస్తుందని ప్రశ్నించారు. గతేడాది పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడంతో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3 వేల అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన నాలుగేళ్ల కాలంలో ఈ పోస్టుల భర్తీ ఊసెత్తలేదన్నారు. పుస్తకాలు, అధ్యాపకులు కొరత కారణంగా గతేడాది 36 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారనే విషయాన్ని ప్రభుత్వం గమనంలో ఉంచుకోవాలన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన మధ్యాహ్న భోజన పథకాన్ని వైసిపి ప్రభుత్వం నిలిపేసిందన్నారు. వెంటనే ఈ పథకాన్ని తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రభుత్వం జూనియర్ కళాశాలలకు శ్వాశత భవనాలు, అదనపు తరగతి గదులు నిర్మించాలన్నారు. ఇంటర్ చదువుకున్నే విద్యార్థులందరికీ అమ్మ ఒడిని అందించాలన్నారు. ప్లస్-1,2 తరగతుల్లో హెచ్ఇసి, సిఇసి గ్రూపులను ప్రవేశపెట్టాలన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం నెలరోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలిపినా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. ప్రభుత్వం మొద్దు నిద్రను వీడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే విద్యార్థులను ఐక్యం చేసుకుని పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ దీక్షలో నాయకులు అరుణ్, మణికంఠ, గోపాల్, అభిషేక్, సాహిత్, అరుణ్‌కుమార్, ప్రశాంతి, హేమ, సౌజన్య, జగదేశ్వరీ, జ్యోతి, దివ్య పాల్గొన్నారు.

పలువురి మద్దతు

ఎస్ఎఫ్ఐ రిలే నిరాహార దీక్షలకు వివిధ ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. సిఐటియు నగర అధ్యక్షులు పలివెల వీరబాబు, ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి రమణి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్ సంఘీభావం తెలిపారు. ఎస్ఎఫ్ఐ రిలే నిరాహార దీక్షలకు స్పందించి జిల్లా ఒకేషనల్ విద్యాశాఖ అధికారి నూకరాజు దీక్షా శిబిరానికి వచ్చి ఎస్ఎఫ్ఐ నాయకులతో మాట్లాడారు. డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆప్ నాయకులు వచ్చి నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేశారు.

ప్రణాళిక ప్రకారం ఓటర్ల జాబితా సర్వే

ప్రజాశక్తి - కాకినాడ

బిఎల్ఒలతో చేపట్టిన ఓటర్ల జాబితా సర్వేను ప్రణాళికాయుతంగా కొనసాగించాలని కలెక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఓటర్ల జాబితా తనిఖీ, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే, వాలంటీర్ల ఎడ్యుకేషన్ సర్వే, నాడు-నేడు పనులు, జెవికె కిట్ల పంపిణీ, సిసిఆర్‌సి కార్డుల పంపిణీ, బ్యాంకు రుణాలు మంజూరు, జగనన్న పాల వెల్లువ, బిఎంసియు యూ గ్రౌండింగ్, పశువులు కొనుగోలు, ప్రభుత్వ శాశ్వత భవనాలు, జగనన్నకు చెబుదాం ఆడిట్ వంటి అంశాలకు సంబంధించిన పురోగతిని క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కాకినాడ కలెక్టరేట్ నుంచి జెసి ఇలాక్కియా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఇంటింటా సర్వేను కొనసాగించాలన్నారు. జిల్లాలో 21న ప్రారంభించిన ఓటర్ల జాబితా ఇంటింటి తనిఖీలను బిఎల్ఒలతో ప్రణాళికాయుతంగా చేపడుతూ విజయవంతంగా కొనసాగించాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు అతిక్రమించే బిఎల్ఒలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ కె.శ్రీధర్‌రెడ్డి, డిఇఒ కెఎన్‌విఎస్.అన్నపూర్ణ, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.శ్రీనివాసు, కాకినాడ డిఎల్‌డిఒ పి.నారాయణమూర్తి పాల్గొన్నారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

స్పందనకు 291 అర్జీలు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనకు 291 అర్జీలు వచ్చాయని కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. జెసి ఇలాక్కియా, డిఆర్ఒ కె.శ్రీధర్‌రెడ్డి, సిపిఒ పి.త్రినాథ్, బిసి, ఎస్‌సి కార్పొరేషన్ల ఈడీలు ఎస్‌విఎస్.సుబ్బలక్ష్మి, డిఎస్.సునీతలతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. జిల్లాలో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం 291 అర్జీలు వచ్చాయన్నారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారాలు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిధులు, విధుల కోసం సర్పంచుల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

నిధులు, విధుల కోసం సర్పంచులు రోడ్డెక్కారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నాకు దిగారు. పార్టీలకతీతంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నుంచి పలువురు సర్పంచులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఎంత సేపు ధర్నా చేసినా కలెక్టర్ స్పందించకపోవడంతో వారు ఆగ్రహానికి గుర్యారు. డిఆర్ఒ వచ్చి వినతిపత్రం తీసుకుంటామన్నా వారు వినలేదు. కలెక్టర్‌కే వినతిపత్రం అందిస్తామని భీష్మించారు. స్పందన హాల్ ఎదుట బైటాయించారు. దీంతో కొద్దిపాటి ఉద్రిక్తత చోటు చేసుకుంది. కలెక్టర్ స్పందించి సర్పంచులను కలిసేందుకు అనుమతి ఇవ్వడంతో ఉద్రిక్తత సడలింది. ఈ సందర్భంగా ఉభయగోదావరి జిల్లాల సర్పంచుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు నాగబత్తుల శాంత కుమారి మాట్లాడారు. గ్రామ పంచాయతీలకు వచ్చిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంటుందన్నారు. గ్రామ స్థాయిలో పనులు చేయకుండా వాలంటరీ వ్యవస్థ ద్వారా విధులను రాష్ట్ర ప్రభుత్వ దోచుకుని సర్పంచులకు తీవ్ర అన్యాయం చేసుందన్నారు. పలువురు సర్పంచులు మాట్లాడుతూ గత మూడేళ్లుగా నిధుల్లేక గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రజల సమస్యలు తీర్చాలనుకున్నా ఏం చేయలేని స్థితిలో ఉన్నామన్నారు. అయినా తమ సమస్యలను తీర్చేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడం సిగ్గుచేటు అన్నారు. 14, 15 ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దొంగలించి సొంత పథకాలకు అవసరాలకు దారి మళ్లించడం సరికాదన్నారు. ఎలా అయితే గ్రామాల అభివృద్ధి ఎలా జరుగుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో పారిశుధ్యం కుంటు పడిందని, రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. నిధులు ఇవ్వకుండా విధులు లాక్కుంటే గాంధీజీ కలలగన్న గ్రామ స్వరాజ్యం ఎలా సాకారమవుతుంతో రాష్ట్ర ప్రభుత్వమే చెప్పాలన్నారు. తమ 15 డిమాండ్లను వెంటనే నెరవేర్చాలన్నారు. గ్రామాల్లో వాలంటీర్లు సచివాలయ వ్యవస్థ కింద జరిగే పనులు సర్పంచుల ద్వారానే నిర్వహించాలని డిమాండ్ చేశారు.


స్పందన హాల్ వద్ద బైటాయించిన సర్పంచులు

ఆర్చరీ విజేతకు అభినందన

ప్రజాశక్తి - పిఠాపురం

అంతర్జాతీయ ఓపెన్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రెండు స్వర్ణాలు సాధించిన రాజమహేంద్రవరానికి చెందిన వీధి సాయిమోహన్ అక్షయ్‌నాయుడును సోమవారం పట్టణంలోని ఆర్చరీ అసోసియేషన్ సభ్యులు లక్ష్మణరావు స్వగృహంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జేఎన్ఎస్ గోపాలకష్ణ శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల15, 16 తేదీల్లో శ్రీలంక దేశం కొలంబోలోని రాజపక్సే స్టేడియంలో శ్రీలంక ఆర్చరీ అసోసియేషన్ వారు నిర్వహించిన ఇంటర్నేషనల్ ఓపెన్ ఆర్చరీ ఛాంపియన్షిప్ పోటీల్లో అక్షయ్ పాల్గొన్నాడని తెలిపారు. రికర్వ్ బౌ 30 మీటర్స్, 60 మీటర్స్ విభాగంలో స్వర్ణాలు సాధించడాని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రాంప్రసాద్‌శేఖర్, ప్రభాకర్, నాగేంద్రకుమార్, కె.కృష్ణ, కాకినాడ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ శ్రీనివాస్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెరుకూరు సత్యనారాయణ, ది సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ కే పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.



పతకాలతో అక్షయ్


పిఠాపురంలో మానవహారం

మణిపూర్ హింసకు వ్యతిరేకంగా మనవహారం


ప్రజాశక్తి - పిఠాపురం

మణిపూర్ లో జరుగుతున్న హింసను వ్యతిరేకిస్తూ పట్టణంలోని స్థానిక ఉప్పాడ బస్టాండ్ సెంటర్‌లో అంగన్‌వాడీలు, భవన నిర్మాణ కార్మిక సంఘం, రజక వత్తిదారుల సంఘం, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, రిక్షా కార్మిక సంఘాలు, సిఐటియు ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించాయి. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు కె.చిన్న, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు సిహెచ్.రమాప్రభ మాట్లాడారు. మణిపూర్‌లో ప్రజలకు, మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. మణిపూర్‌లో శాంతి భద్రతలను పరిరక్షించాలన్నారు. ఈ ఘటనలకు బాధ్యత వహించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బిరేన్ సింగ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ భవాని, ప్రజావాణి, బేబి, విజయశాంతి, గౌరీ, నాగ పద్మ, కరణం విశ్వనాథం, కోనేటి రాజు, కె.నాగేశ్వరరావు, కె.మణి, శ్రీకాంత్, జి.వీరబాబు,ఎస్ శ్రీను,పి ప్రకాష్,సత్యనారాయణ, సత్తిబాబు,రామకష్ణ. తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట రూరల్ : మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, హింసాత్మక సంఘటనలను వ్యతిరేకిస్తూ క్రైస్తవులు సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక ఆంధ్ర బాప్టిస్ట్ చర్చిలో దైవజనులు రెవరెండ్ బి.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ ప్రార్థనలు జరిగాయి.


సామర్లకోటలో ప్రార్థనలు


కార్టూ'నిజం'



జగనన్న సురక్షతో సత్వర సేవలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రభుత్వ పథకాలు మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు జగనన్న సురక్ష దోహదం చేస్తుందని ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. సోమవారం ఏలేశ్వరంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలను వినియోగించుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. అనంతరం పెద్దనాపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్లు ఆలమండ చలమయ్య, బదిరెడ్డి గోవిందబాబు, బొద్దిరెడ్డి గోపి, కోణాల వెంకటరమణ, ఎండగుండి నాగబాబు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జువ్వెన వీర్రాజు, జడ్‌పిటిసి మాజీ సభ్యులు శిడగం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


రౌతులపూడి మండలం లచ్చిరెడ్డిపాలెంలో...

కాజులూరు : లబ్ధిదారుల మేలుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జడ్‌పిటిసి సభ్యులు వి.వెంకటసుబ్బారావు తెలిపారు. సోమవారం మంజేరు సర్పంచ్ గుంటూరి అప్పారావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమంలో జడ్‌పిటిసి పాల్గొని మాట్లాడారు. జగనన్న సురక్ష ద్వారా 11 ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపిడిఒ రత్నరాజ్, ఇఒపిఆర్‌డి ఇందిరాదేవి, సహకార సంఘ అధ్యక్షులు గండి కిషోర్, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ వైస్ ఎంపిపి పెద్దిరెడ్డి వెంకటరమణ, వాలంటీర్లు పాల్గొన్నారు.

రౌతులపూడి : మండలంలోని లచ్చిరెడ్డిపాలెంలో ఎంపిడిఒ ఎం.గోవిందు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మార్కెట్ కమిటీ చైర్మన్ జిగిరెడ్డి రమణమ్మ హాజరై మాట్లాడారు. పలువురికి సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో సూరెడ్డి తిరుమలరాయలు, డిసిసిబి డైరెక్టర్ పులి మధు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

పెద్దాపురం : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసి మంగతాయారు అన్నారు. శంకరయ్యపేటలోని 22, 23 వార్డులకు సంబంధించి 12వ సచివాలయంలో సోమవారం నిర్వహించిన సురక్ష సభలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్ ముప్పన శ్యామలాంబ, కౌన్సిల్ కో-ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, టిపిఒ ఉమామహేశ్వరరావు, సచివాలయం అడ్మిన్ సురేష్, విఆర్ఒ సునీతి పాల్గొన్నారు.


ఏలేశ్వరంలో ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్రప్రసాద్

గండేపల్లి : జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరుతుందని ఎంపిపి చలగళ్ల దొరబాబు అన్నారు. గండేపల్లి సచివాలయం-2 లో సర్పంచ్ రుత్తుల లలిత ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండలం మొత్తం 8,602 దరఖాస్తులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కెవివి.సత్యనారాయణ, ఇఒపిఆర్‌డి విఎస్ఎన్.మూర్తి, పంచాయతీ కార్యదర్శి డిఎస్ఎన్.రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ తాళ్లూరి మధుకుమార్, వైసిపి నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లరేవు : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే పలు రకాల సేవలు అందిస్తున్నట్లు ఎంపిపి రాయుడు సునీత అన్నారు. పటవల పంచాయతీ సచివాలయం-2 పరిధిలో సర్పంచ్ పినపోతు కామేశ్వరరావు అధ్యక్షత నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. 757 మందికి పలు సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్‌సాగర్, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, కొటికలపూడి చంద్రశేఖర్, అనుకూలి సత్తిబాబు, చక్కపల్లి లక్ష్మణ్, తహశీల్దార్ పోతురాజు, ప్రత్యేక అధికారి లక్ష్మీనరసయ్య, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



బాలుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

కొత్తపల్లి మండలం కోనపాపేట తీరంలో సముద్ర స్నానానికి దిగి గల్లంతైన బాలుని మృతదేహం సోమవారం ఉదయం కోనపాపేట తీరంలో లభ్యమైంది. సామర్లకోట మండలం పి.వేమవరానికి చెందిన కొంత మంది ఆదివారం లోవ దర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కోనపాపేట వద్ద సముద్రంలో స్నానానికి వెళ్లారు. అలల ఉధృతి అధికంగా ఉండడంతో పసుపులేటి పార్థు(9) గల్లంతయ్యాడు. బాలుని మృతదేహం కోనపాపేట తీరంలో ఒక హ్యాచరీ సమీపాన సముద్ర ఒడ్డుకు చేరింది. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

గ్యాస్ లీకై చెలరేగిన మంటలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక సినిమా సెంటర్‌లో ఒక హోటల్‌లో సోమవారం రాత్రి గ్యాస్ బండ నుంచి గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించటంతో హుటాహుటిని అగ్నిమాపక సిబ్బంది వచ్చి గ్యాస్ మంటలను ఆర్పి వేశారు. వెంటనే మంటలను ఆర్పి వేయడం వల్ల ఎలాంటి నష్టం జరగలేదని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 8 మంది అరెస్ట్

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట పట్టణంలో పలు ప్రాంతాలలో పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌ల్లో ఎనిమిది మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని సామర్లకోట సిఐ దుర్గాప్రసాద్ చెప్పారు. ఎస్‌పి ఆదేశాల మేరకు ఎస్ఐ చిత్రాడ గోపాలకష్ణ, సిబ్బందితో ఆదివారం రాత్రి ఈ తనిఖీలు చేపట్టారన్నారు. సామర్లకోటకు చెందిన ఎం.హరిబాబు, ప్రదీప్ యాదవ్, ఎం.గోవింద్, పెద్దాపురానికి చెందిన కొర్రిపూరి శ్రీనివాస్,మహేంద్ర శ్యామ్ కిషోర్, రామచంద్రపురానికి చెందిన పువ్వుల ప్రసాద్, జొన్నాడకు చెందిన బందరు దుర్గారావు, ఆర్‌బి.కొత్తూరుకు చెందిన కద్ద సీత రాంబాబులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించడం లక్ష్యంగా క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ప్రజలు, వాహనదారులు, ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా సహకరించాలని సీఐ దుర్గాప్రసాద్ కోరారు.

క్లీనర్ మృతిపై డ్రైవర్ పిర్యాదు

ప్రజాశక్తి - ఆలమూరు

క్లీనర్ మృతి చెందడంతో డ్రైవర్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల మేరకు యెనుగుదాటి వరప్రసాద్ లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. భీమవరానికి చెందిన జి.లక్ష్మణరాజు క్లీనర్‌గా ఉన్నాడు. ఈ నెల 23న క్లీనర్‌తో కలిసి వరప్రసాద్ రాజమహేంద్రవరం నుంచి మండలంలోని పెదపల్ల రైస్ మిల్‌కు రైస్ బ్యాగ్స్ లోడ్ కోసం వచ్చారు. లారీకి టార్పాలిన్‌లను ఇద్దరూ కలిసి కడుతున్నారు. లారీపైన ఉన్న క్లీనర్ లక్ష్మణరాజు(45) లారీపైనే కూర్చొని ఆకస్మిక మరణం పొందాడు. ఈ మేరకు డ్రైవరు వరప్రసాద్ సోమవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్



గణేష్ కాలనీ బ్రౌన్ పేట్ సెంటర్‌కు చెందిన 12 ఏళ్ల బాలిక అదృశ్యంపై సోమవారం రాత్రి సామర్లకోట పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. సామర్లకోటకు చెదిన గంట గంగాభవాని(12) గణేష్ కాలనీలో షాపు వద్దకు వెళ్లి అనంతరం ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులకు చుట్టుపక్కల గాలించారు. ఎంతకీ ఆచూకీ దొరక్కపోవడంతో పాప తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తోట సునీత తెలిపారు. నీలం రంగు డ్రెస్, ఆరెంజ్ కలర్ చున్నీ ధరించిందని తెలిపారు. సరిగా మాట్లాడలేదని, అప్పుడప్పుడూ ఫిట్స్ కూడా వస్తాయని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో గాని లేదా 9440796568, 9701626505 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ ఎతలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నాము. పాపం కోసం గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు.

బిలియర్డ్స్ టోర్నీ విజేత పాండురంగయ్య

ప్రజాశక్తి - కాకినాడ

భారతం లక్ష్మీపతి సోమయాజులు మెమోరియల్ దక్షిణ భారత బిలియర్డ్స్ అండ్ స్నూకర్స్ ఛాంపియన్ షిప్-2023 విజేతగా రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్ సభ్యులు ఇ.పాండురంగయ్య(నెల్లూరు) నిలిచారు. తెలంగాణాకు చెందిన బ్రాండెన్ రన్నరప్‌గా నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా అర్జున అవార్డ్ గ్రహీత వరల్డ్ బిలియర్డ్స్ ఛాంపియన్ షిప్ విజేత అశోక్ శాండిల్య హాజరయ్యారు. విజేతలకు ట్రోఫీలను అందించారు. ఆయన మాట్లాడుతూ బిలియడ్స్ స్నూకర్స్ పోటీల నిర్వహణ పట్ల హర్షం వ్యక్తం చేశారు. విన్నర్, రన్నర్‌తోపాటూ హైయెస్ట్ స్కోర్ చేసిన క్వాటర్ ఫైనలిస్టు కె.విభాస్ (తెలంగాణా), దిలీప కుమార్(ఆర్ఎస్‌పిబి), నరేష్ జెర్సీ(తెలంగాణా), రఫత్ హబీబ్(తమిళనాడు), సెమీఫైనలిస్టులు కె.గిరీష్(ఆర్ఎస్‌పిబి), ఎ.అరవింద్ (ఆర్ ఎస్ పి బి) లకు బహుమతులు అందించారు. అతిపెద్ద ట్రోఫీని ప్రత్యేకంగా తయారుచేయించిన హరీష్ స్పోర్ట్స్ అధినేత హరీష్ అందజేసిన ట్రోఫీని విజేత పాండురంగయ్యకు అందించారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, డాక్టర్ యాతగిరి పరశురామ్, టౌన్ హాల్ కమిటీ అధ్యక్షులు నానాజి, కార్యదర్శి పాబోలు చిన్నపున్నయ్య, కాస్మాపొలిటిన్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్‌విఎస్.రావు, టోర్నమెంట్ మేనేజింగ్ కమిటీ లిటరరీ అసోసియేషన్ అధ్యక్షులు జి.సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షులు జివి, రఘునాథ్, కార్యదర్శి పాబోలు చిన్నపున్నయ్య, కాస్మోపాలిటన్ క్లబ్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎస్‌విఎస్.రావ్య తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీని అందుకుంటున్న పాండురంగయ్య



కమిషనర్‌కు మొక్కను బహూకరిస్తున్న డిఎఫ్‌ఒ భరణి

కమిషనర్‌ను కలిసిన డిఎఫ్‌ఓ భరణి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జిల్లా అటవీశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.భరణి సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె గతంలో రంపచోడవరం సబ్ డిఎఫ్ఒగా పనిచేశారు. బదిలీపై ఇక్కడకు వచ్చారు. కమిషనర్‌కు మొక్కను అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

జ్యుడీషియల్ విచారణ చేయాలని వినతి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్



స్పందనకు వచ్చిన బిసి, ఎస్‌సి సంఘాల నాయకులు, మృతుని కుటుంబ సభ్యులు

కిర్లంపూడి మండలం గోనేడలో నాయీబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థిని హత్య కేసుపై జ్యుడీషియల్ విచారణ నిర్వహించాలని, నిందితులను కఠినంగా శిక్షించి, వారికి సహకరిస్తున్న కిర్లంపూడి పోలీస్ అధికారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ధన్వంతరి నాయి బ్రాహ్మణ సమాఖ్య, బిసి, ఎస్‌సి సంఘాల నాయకులు స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ధన్వంతరి నాయి బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షులు సుందరపల్లి వివిఎస్.గోపాలకృష్ణ మాట్లాడారు. గోనేడకు చెందిన విద్యార్థిని జగ్గంపేట అక్షర కాలేజీ నుంచి కాలేజీ బస్సులో ఇంటికి వచ్చే సమయంలో సెల్‌ఫోన్ చోరీకి గురైందని చెప్పి అతని స్నేహితులే బలవంతంగా తీసుకెళ్లారన్నారు. అనంతరం విద్యార్థి అపస్మారక స్థితిలో యానాం గోదావరి ఒడ్డున పడిఉన్నాడన్నారు. జాలర్లు పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. వైద్యం పొందుతూ మృతి చెందాడన్నారు. దీనిపై కిర్లంపూడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు బాధితులు వెళ్ళగా, నిందితులకు వత్తాసు పలుకుతూ స్టేషన్ ఎస్ఐ ఫిర్యాదు తీసుకోకుండా జాప్యం చేశారన్నారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు కలుగజేసుకొని నిందితులను కఠినంగా శిక్షించాలని, నిందితులకు సహకరిస్తున్న పోలీసు అధికారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘాల నాయకులు పప్పు దుర్గారమేష్, గుత్తుల రమణ, చొల్లంగి వేణుగోపాల్, దళిత నాయకులు జగడం సత్యనారాయణ, మెలిపాక నాగబాబు, వి.నాని, ఎం.విష్ణు, మహేష్ బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఓఎన్‌జిసి పరిహారంపై సర్వే పూర్తి

ప్రజాశక్తి - యానాం

ఓఎన్‌జిసి సంస్థ మత్స్యకారులకు 2022 - 23 సంవత్సరానికి ఇచ్చే నష్టపరిహారానికి సంబంధించి పుదుచ్చేరి ప్రభుత్వం, మత్స్యశాఖ విలేజ్ లెవెల్ కమిటీ నిర్వహించిన సర్వే పూర్తి అయ్యిందని మత్స్యశాఖ సహాయ సంచాలకులు డి.గొంతియ్య సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి గ్రామంలోనూ సర్వే నిర్వహించారన్నారు. అర్హులైన మత్స్యకారుల జాబితాను యానాం గవర్నమెంట్ వెబ్‌సైట్, మత్స్యకార గ్రామ కమ్యూనిటీహాలు, మత్స్య శాఖ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ఉంచామన్నారు. అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 2లోపు సరైన ఆధారాలతో మత్స్యశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.



గోతిని పూడ్చండి సారూ...

యానాం నల్లచెరువు కాలవతూము వద్ద పైపులైన్ మరమ్మత్తు పనుల కోసం ఇటీవల రోడ్డు మధ్యన గోతిన తవ్వారు. పని పూర్తయినా నేటికీ గోతిని మాత్రం పూడ్చలేదు. మలుపు వద్ద గొయ్యి ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది అదుపుతప్పి పడిపోతున్నారని స్థానికులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు రోజూ ఇటుగా వస్తున్నా గోతిని మాత్రం పట్టించుకోవట్లేదని వాపోయారు.

ఫోటో, వీడియో గ్రాఫర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

యానాం ఫోటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. జనరల్ బాడీ సమావేశం పార్వతీశ్వరమ్మ మినీ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని వర్తక సంఘం అధ్యక్షులు నల్లా వెంకన్న ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా జెమినీ స్టూడియో అధినేత ఎస్.అహ్మద్ ఎంపికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా జె.లోవరాజు, సెక్రటరీగా పెనుగొండ దుర్గబాబు, ట్రెజరర్‌గా మురళీకృష్ణ, జాయింట్ సెక్రెటరీగా ఎస్‌కె.రహీమ్ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా నల్ల వెంకన్న, ఆరుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితుల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అగ్రిగోల్డ్ భాదితులకు న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం కలెక్టరేట్, జిల్లా పరిషత్ సెంటర్ వద్ద వర్షంలో తడుస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం స్పందనలో వినతిపత్రం అందించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఐ నాయకులు తాటిపాక మధు మాట్లాడారు. అగ్రిగోల్డ్ బాధితుల్లో ఉన్న వారందరూ సామాన్య, మధ్యతరగతి ప్రజలేనన్నారు. కాయ కష్టం చేసి దాచుకున్న సొమ్ముకు భద్రత లేకుండా పోయిందన్నారు. వైసిపి ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు భరోసా ఇచ్చి ఎన్నికల్లో గద్దెనెక్కి నాలుగేళ్లయినా నేటికీ న్యాయం చేయలేదన్నారు. 024 ఎన్నికల్లోపు అగ్రిగోల్డ్ బాధితులకు బాండ్ రూపంలో ఉన్న సొమ్మును చెల్లించాలని లేకుంటే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈ ధర్నాలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, యూనియన్ నాయకులు బాలరాజు, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు వై.నాగలక్ష్మి, వీరమణి, బొమ్మేటి రాంబాబు, కొల్లు శ్రీనివాస్, వైకె.రాజు, శేఖర్, అర్జున్‌రావు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో యశ్వంత్‌కి సిల్వర్ మెడల్

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

జెఎన్‌టియుకెలో నేషనల్ యోగా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన యోగా పోటీల్లో బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి కిలాడి యశ్వంత్ సిల్వర్ మెడల్ సాధించారని వ్యాయామ ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం తెలిపారు. వచ్చే నెలలో ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్ల యశ్వంత్ పాల్గొంటారన్నారు. ఈ విద్యార్థి యశ్వంత్, వ్యాయామ ఉపాధ్యాయులు వైకుంఠంను మున్సిపల్ చైర్మన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ జాన్‌మోజేష్, పిఎంసి చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు, కమిషనర్ జె.రామారావు, హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ తదితరులు అభినందించారు.

సిఎంను కలిసిన దొరబాబు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

అమరావతిలో పేదల ఇళ్ల నిర్మాణం తదితర కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన సిఎం జగన్‌ను ఎపీ స్టేట్ హౌసింగు కార్పొరేషన్ చైర్మన్, వైసిపి పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు కలిశారు. హెలీకాప్టర్‌లో కృష్ణాయపాలెం వద్దకు చేరుకున్న సిఎంకు దొరబాబు పుష్పగుచ్చం అందించారు. అనంతరం సిఆర్‌డిఎ పరిధిలో ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇడబ్ల్యూఎస్ లే-అవుట్లలో రూ.1,829.57 కోట్లతో చేపట్టనున్న 50,793 ఇళ్ల నిర్మాణానికి, 45 సామాజిక వసతుల ప్రాజెక్టులకు సిఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో దొరబాబు పాల్గొన్నారు. దొరబాబు మాట్లాడుతూ విపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా అమరావతిలో పేదల ఇళ్ల నిర్మాణానికి సిఎం జగన్ పూనుకోవడం హర్షణీయమన్నారు.

నిర్లక్ష్యాన్ని వీడాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలో అచ్చంపేట- గొంచాల గ్రామాల మధ్యలో నిర్మించిన హైవే రహదారికి అప్రోచ్ రోడ్డు నిర్మించకుండా నిర్లక్ష్యంగా వదిలేశారని, ఫలింగా ఇప్పటి వరకూ జరిగిన ప్రమాదాల్లో ఐదుగురు మరణించారని, ఇప్పటికైనా స్పందించి చర్యలు చేపట్టాలని, లేకుంటే ప్రత్యక్ష ఆందోళన చేపడతామని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మల రామస్వామి హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో డిఆర్‌ఒకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సరోజా వాసు, పిట్టా జానకిరామారావు పాల్గొన్నారు.

జగన్ పాలనలో యువశక్తి నిర్వీర్యం

ప్రజాశక్తి - కోటనందూరు

జగన్ పాలనలో యువశక్తి నిర్వీర్యమవుతుందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు అన్నారు. సోమవారం తేటగుంటలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకొచ్చిన జగన్ రాష్ట్రాన్ని అప్పుల పాల్జేశారన్నారు. నాలుగేళ్లల రూ.11 లక్షల అప్పు చేసి ప్రజలపై పెనుభారాన్ని మోపారన్నారు. ప్రస్తుతానికి మినీ మేనిఫెస్టోను పార్టీ విడుదల చేసిందన్నారు. ఎన్నికల సమయంలో మరో మేనిఫెస్టోను సిద్ధం చేశామన్నారు. ప్రజలందరూ అభివృద్ధి చెందేలా మేనిఫెస్టో ఉంటుందన్నారు. టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్తు బాగుపడుతుందన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర ప్రచార ఆర్గనైజర్ యనమల కృష్ణుడు, టిడిపి తుని నియోజకవర్గ ఇన్‌ఛార్జి యనమల దివ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒ స్పందనకు 12 అర్జీలు

ప్రజాశక్తి- పెద్దాపురం

స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం ఆర్‌డిఒ జె.సీతారామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనకు 12 అర్జీలు వచ్చాయి. వీటిని పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించామని ఆర్‌డిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి బాలామణి, మున్సిపల్ మేనేజర్ జ్యోతి రాణి తదితరులు పాల్గొన్నారు.

'పేదల ఆకలిని గుర్తించింది టిడిపియే'

ప్రజాశక్తి - జగ్గంపేట

పేదల ఆకలిని గుర్తించిన పార్టీ టిడిపియేనని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. కాకినాడ రోడ్‌లో గల ఎన్‌టిఆర్ స్మారకమందిరం కాంస్య విగ్రహం వద్ద ప్రతి సోమవారం అన్నా క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కిర్లంపూడి మండల టిడిపి నాయకులు తూము కుమార్ ఆర్థిక సాయంతో భోజనాలను ఏర్పాటు చేసి పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతుల ప్రారంభించి మాట్లాడారు. పేదల కోసం టిడిపి ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఈ ప్రభుత్వానికి కళ్లు తెరిపించేందుకు జగ్గంపేటలో ప్రతి సోమవారం అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పలరాజు, టిడిపి మండల అధ్యక్షులు మారిశెట్టి భద్రం, వేములకొండ జోగారావు, బోండా రాజేష్, టిడిపి మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎమ్‌డి.కాజా, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారులకు కష్టాలు

ప్రజాశక్తి - జగ్గంపేట



నీటితో నిండిపోయిన సర్వీసు రోడ్డు

అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. జగ్గంపేటలోని తుని వైపు వెళ్లే సర్వీస్ రోడ్డులో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిలిచిపోతోంది. పలుమార్లు హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద సర్వీస్ రోడ్డును ఆనుకొని ఉన్న రహదారి కింద భాగాన డ్రెయినేజీ మట్టితో పూడుకుపోయింది. దీంతో వర్షపు నీరు నిలిచిపోతోంది. మోకాళ్ళ లోతుకుపైగా 100 మీటర్ల మేర సర్వీస్ రోడ్డు పొడవునా నీరు ఉండిపోవడంతో వాహనదారులు, బాటసారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్నేళ్లుగా ఇదే సమస్య ఉన్నా హైవే అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారు. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు కూడా స్పందించట్లేదని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రొఫెసర్ శ్రీనివాసరావుకు డాక్టరేట్

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరం పాలెం ఆదిత్య విద్యాసంస్థల్లో హెచ్ అండ్ బిఎస్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డి. శ్రీనివాసరావుకు 'ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రసాదించిందని ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. డాక్టర్ ఆర్.డేవిడ్‌కుమార్ నేతృత్వంలో శ్రీనివాసరావు సమర్పించిన 'స్టడీ ఆఫ్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్ఫర్ ఆఫ్ సమ్ నాన్ - న్యూటోనియన్ ఫ్లూయిడ్స్' అనే సిద్ధాంత వ్యాసానికి డాక్టరేట్ లభించిందన్నారు. శ్రీనివాసరావు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి, వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ డోలా సంజయ్, డీన్ ఎ.రామకృష్ణ, విభాగాధిపతి బిఎస్ఎన్.మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి..వేణుగోపాల్ తదితరులు అభినందనలు తెలిపారు.

గొల్లలగుంటలో సచివాలయం, ఆర్‌బికె ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని గొల్లలగుంటలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్‌బికె భవనాలను ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు సోమవారం ప్రారంభించారు. అనంతరం సచివాలయంలో జగనన్న సురక్ష సభను ఎంపిడిఒ వసంతకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. అనంతరం వైసిపి సేవాదళ్ రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ ఒమ్మి రఘురాం మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకు చిత్తశుద్ధితో అభివద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అత్తులూరి నాగబాబు, జగ్గంపేట ఉప సర్పంచ్ బండారు రాజా, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేటలో పాత ప్లాస్టిక్ గోనె సంచుల కంపెనీలో తొలగించిన కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని, జీతాల బకాయిలు చెల్లించాలని ఐఎఫ్‌టియు అధ్యక్షులు ఎం.ఏసు డిమాండ్ చేశారు. జగ్గంపేటలోని స్టాలిన్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. స్థానికులను తొలగించి ఒడిశా వాసులను పనిలో పెట్టుకోవడం సరికాదన్నారు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామనానరు. అధికారులను కలిసి చట్టపరమైన పోరాటం చేస్తామని డిమాండ్ చేశారు. న్యూ డెమోక్రసీ డివిజన్ ప్రధాన కార్యదర్శి వి.చిట్టిబాబు ఎఐకెఎంఎస్ జిల్లా కమిటీ సభ్యులు కె.లక్ష్మి, పివైఎల్ జిల్లా అధ్యక్షులు జి.బాలరాజు, దాసరి రత్నం, కొట్టెడ అమ్మాజీ, సత్యవరపు వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు శాంతి ర్యాలీ

కాకినాడరూరల్ : జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్, ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25న మంగళవారం మణిపూర్ సంఘటనలపై శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు క్రైస్తవుల పెద్దలు జోసెఫ్ బెన్నీ, శామ్యూల్, సాగర్, రిక్కీ గూటం తెలిపారు. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట వైద్యనగర్ ఫ్రెండ్స్ కాలనీలో గల బెరాక బ్లెస్సింగ్ చర్చిలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో శాంతి ర్యాలీ వివరాలను వెల్లడించారు. మణిపూర్ హింసలో 249 చర్చిలను కూల్చేశారన్నారు. స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలు, అకృత్యాలకు అనేక మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. వీటిని నిరసిస్తూ శాంతి ర్యాలీ చేపడుతున్నామని తెలిపారు. భానుగుడి జంక్షన్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ జరుగుతుందన్నారు.